
అఖండ దీపికలు

# అఖండ దీపికలు

నవలిక

వావిలికొలను రాజ్యలక్ష్మి

సూర్య ప్రచురణలు
హైదరాబాద్

***Akhanda Deepikalu***

By **Vavilikolanu Rajyalakshmi**

© Vavilikolanu Rajyalakshmi

*First Edition* : 2014

*Price* : ₹ **100/-** $ **10**

*For Copies* :

**Vavilikolanu Rajyalakshmi**
S.V. Nilayam, Plot No. 28/B, Flat No. G2
Prabhatnagar Colony, Chaitanyapuri
Hyderabad - 500 060, Telangana State
Ph: 040-2405 3455, Cell: 9347755885
Email: rajyam2005@gmail.com

&

**All leading Bookshops**

*Book Production* :
*'Pustakashilpi'*
**T. Muralidhar Gowd**
tmgowd@gmail.com
9393 176 552

*Cover Concept*:
**P.L.Kishore Kumar**

*Cover Design* :
**T. Mallesh**

*D.T.P.* :
**K.B.T. Kondaiah**

*Published by* :
**Surya Prachuranalu**
37/202. Rammohan Tower
Huda complex, Saroor Nagar,
Hyderabad - 500 035
Ph: 040-2404 7889

*Printed at :*
**Karshak Art Printers**
(*Multicolour Printers & Designers*)
40-APHB, Vidyanagar, Hyderabad - 500 044
Ph : 040-2761 8261

# 'నవలా' యాత్ర

ఇది ఒక విధంగా నవలా రూపంలో కొనసాగిన యాత్రా కథనం. అంతేకాదు– నవలామణి రాజ్యలక్ష్మి యాత్రానుభూతుల ప్రతిరూపం. విభిన్న మనస్తత్వాల సమ్మేళనం.

మారిషస్, ఇంగ్లండ్, ఇండియా– మూడు దేశాలతో అనుబంధం ఉన్న కుటుంబగాథ ఇందలి ఇతివృత్తం. తాతా అమ్మమ్మలు, మనుమలు, మనుమరాళ్ళు, తల్లీ కూతుళ్ళు, అన్నదమ్ములు, ఆలుమగలు మున్నగు మానవ సంబంధాలు ఇందు హృద్యంగా చిత్రితమైనాయి. నయవంచకులైన సతీపతులు కృష్ణవేణి రాజేంద్రలు– సహృదయ సోదరులు జితేంద్ర భాస్కర్‌లు– వియోగ బాధితులైన దీపిక మనీషలు– ప్రేమికులైన మనీష నిహార్‌లు– అందరినీ మించి జీవిత సారాన్ని కాచి వడబోసిన వివేకజ్ఞులు ఆనందరావు (తాత), పరమేశ్వరి (బామ్మ) మున్నగు పాత్రల ఆలంబనతో కథను రక్తికట్టించారు రచయిత్రి. అయితే పూలబాటలో సుగమంగా సాగిపోయే వ్యక్తులే కాదు ముళ్ళబాటలో పయనించే జీవితాలు కూడా ఇందు గోచరమవుతాయి. మగవాని వంచనకు గురియైన మగువ దీపిక పాత్ర చిత్రణమే అందుకు నిదర్శనం.

రాజ్యలక్ష్మి విదేశ పర్యటనా విశేషాలు ఈ నవలలో కథోచితంగా చోటుచేసుకోవటం గమనార్హం. లండన్ నగరంలోని థేమ్స్ నదీ ప్రాంతం, విస్సల్ క్యాజుల్, మేడం టుస్సాడ్ మ్యూజియం, ప్యారిస్‌లోని ఈఫిల్ టవర్ మొదలైన స్థలాల వర్ణనలు నేను యూరప్ దేశాలను దర్శించినప్పటి యాత్రాస్మృతులను వెలికి తెచ్చాయి. మన ప్రాంతంలోని వర్గల్ క్షేత్ర విశేషాలు కూడా ఇందు వర్ణితమైనాయి. విదేశంలో ఉన్నవారు కర్మకాండకు సంబంధించిన మన ఆచారాలను పాటించడం రచయిత్రికిగల సంప్రదాయాభిమానాన్ని చాటుతుంది. పట్నవాసాల జీవితంతోపాటు పల్లెసీమ ప్రకృతి చిత్రణ కూడా ఇందు మనోజ్ఞంగా దృశ్యమాన మవుతుంది.

నల్లిపై చాటుపద్యం, ధ్యానయోగ సంబంధమైన స్వామీజీ ఆధ్యాత్మిక ప్రసంగం, వంటలు– రుచులు మొదలైన అంశాల ప్రస్తావన రచయిత్రికి గల లోకజ్ఞతకు ఉదాహరణలు. వర్ణనాత్మకంగా– కథనాత్మకంగా ఇంపైన భాషా శైలితో నవల ఆద్యంతమూ ఆహ్లాదకరంగా సాగుతుంది. పగలు– ప్రతీకారాలతో నిండిన విలన్ పాత్రలు, మహిళలకు మహిళలే శత్రువులని చాటిచెప్పే దుష్ట పాత్రలతో కూడిన టి.వి.ల ధారావాహిక ప్రసారాలకు భిన్నంగా– ఆరోగ్య కరమైన కుటుంబ వాతావరణ నేపథ్యంలో విరచితమైన 'అఖండ దీపికలు' నవల మండువేసవిలో చలివేంద్రంలా సేద దీరుస్తుంది. నిర్మల హృదయిని వావిలికొలను రాజ్యలక్ష్మిగారి భావాల వెలుగులను ప్రసరిస్తూ పాఠకలోకాన్ని అలరిస్తుంది.

తే: 26-03-2014

**ఎస్వీ రామారావు**

# నా మాట

ఇంతకుముందు నా మూడు పుస్తకాలు ప్రేమ పుష్పం, హృదయ సుగంధం (నవలలు), బ్రహ్మలిఖితం (కథలసంపుటి) – ప్రచురించిన 'పుస్తకశిల్పి' శ్రీ తాళ్ళపల్లి మురళీధర గౌడుగారే ఈ నవలను కూడా ప్రత్యేక శ్రద్ధతో ప్రచురించి వెలుగులోకి తెస్తున్నందుకు ముందుగా వారికి నా ధన్యవాదాలు.

ఈ నవలను 'అక్షరాంజలి' మాసపత్రికలో రెండు సంవత్సరాలపాటు ధారావాహిక సీరియల్‌గా ప్రచురించిన సంపాదకులు శ్రీ ఉమ్మెత్తల నరసింహ్మామూర్తిగారికి కృతజ్ఞతలు.

అడగ్గానే 'నవలా యాత్ర' అన్న పేరుతో చక్కటి ముందు మాట రాసి అందించిన సోదరులు సహృదయులయిన ఆచార్య ఎస్వీ రామారావుగారికి హృదయ పూర్వక ధన్యవాదాలు.

ముఖచిత్రాన్ని రూపొందించిన చి॥ పి.ఎల్. కిషోర్ కుమార్‌కి దానిని అందంగా తీర్చిదిద్దిన శ్రీ టి.మల్లేశ్‌గారికి అభినందనలు.

డి.టి.పి. చేసిన శ్రీ కె.బి.టి.కొండయ్యగారికి, సకాలంలో ముద్రించిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ అధినేత శ్రీ జగన్మోహన రెడ్డిగారికీ కృతజ్ఞతలు.

*రాజ్యలక్ష్మి*

# అఖండ దీపికలు

**ఆ**రోజు మనీష ఆనందం వర్ణనాతీతం. పట్టశక్యం కాకుండా ఉంది. ఆ విశాలమైన సోగనేత్రాలలో వెన్నెల వెలుగులు తళుక్కుమంటున్నాయి. చంద్రబింబం లాంటి ఆమె దరహాస వదనంలో సంతోష తరంగాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి.

తాను ఎయిర్‌హోస్టెస్‌గా సెలెక్ట్ అయిన రోజుకంటే కూడా... ట్రైనింగ్ కాలం పూర్తి అయి పోస్టింగ్ ఆర్డర్ చేతికి వచ్చిన ఈ రోజు మనీషకు మహానందంగా ఉంది.

ఈ శుభవార్త ముందు తెల్సుకున్న పరమేశ్వరి గబగబా వంటింట్లోకి వెళ్ళి గుప్పెడు పంచదార తెచ్చి మనుమరాలి నోట్లో పోసి తీపి చేసి అంతులేని ప్రేమాను రాగాలతో గబుక్కున అక్కున చేర్చుకుంది.

మనీష చప్పున కిందికి వంగి ఆవిడకు పాదాభివందనం చేసింది.

"నానమ్మా! నా ఈ గొప్పతనమంతా నీది, తాతయ్య దీవెనల చలవే! మీరిచ్చిన ఆత్మవిశ్వాసంతో... దృఢ సంకల్పంతో నేనీ విజయాన్ని సాధించగలిగాను ఇందులో కొంచెం నిహార్ భాగం కూడా ఉంది. నా మనస్సుకిప్పుడు ఎంతో ఆనందంగా ఉంది. ఆకాశమార్గంలో హాయిగా విహంగంలా ఎగిరిపోతున్నంత అత్యద్భుతంగా ఉంది. ఈ సంతోషాన్ని పాలు పంచుకోవడానికి సమయానికింట్లో తాతయ్య కూడా లేడు..."

"తాతయ్య మీ మామ ఇంటికి వెళ్ళాడు; షాపు విషయం ఏదో మాట్లాడాలని. ఈ పాటికి దారిలో వస్తూనే ఉంటాడుగాని, నాతో మాత్రం ముందు ఓ ముఖ్యమైన విషయం చెప్పు అమ్మలూ?" సంతోషం పట్టలేకపోతుంది పరమేశ్వరి.

"ఏంటీ నానీ? అదేంటో త్వరగా అడుగు నాకు తెల్సిందైతే తప్పకుండా చెప్తాను..." నానమ్మ భుజాలు పట్టుకొని ఆనందాతిశయంతో ఊపుతూ ఉత్సాహంగా అంది మనుమరాలు.

"మరే... మరే నీవిప్పుడు విమానాలలో తిరిగే డ్యూటీలో అప్పుడప్పుడు మన ఇండియాకి కూడా వెళ్ళుతావా?" ఆవిడ ఆత్రంగా అడుగుతున్న ఆ ప్రశ్నలో... ఆ ముఖంలో జన్మభూమిపట్ల తనకున్న మక్కువ, ప్రేమ, దేశభక్తి స్పష్టంగా ద్యోతక మవుతున్నాయి.

"వైనాట్ నానీ? అప్పుడప్పుడు డ్యూటీ పరంగా తప్పకుండా ఇండియా వెళ్ళాల్సి వస్తుంది. హైదరాబాద్‌కైతే వెళ్తానో వెళ్ళనో నాకైతే ప్రస్తుతం సరిగ్గా తెలీదుగానీ... బొంబాయి, ఢిల్లీకి మాత్రం కంపల్సరీగా వెళ్ళాల్సి వస్తుందప్పుడప్పుడు. నీకింకో విషయం కూడా చెప్పనా నానీ? లండన్‌కి కూడా వెళ్తాను. అలా డ్యూటీలో వెళ్ళినప్పు డక్కడ మమ్మీని కల్సి మాట్లాడవచ్చు కూడాను...

మనుమరాలన్న ఆ మాట వినగానే ఈమారు పరమేశ్వరి వదనం క్షణంలో వివర్ణమై రంగులు మారాయి.

ఇందాకటి ఆవిడ ఉత్సాహమంతా ఒక్కసారిగా నీరుగారిపోయింది.

"ఏం, నానీ... మాట్లాడవేం?

"........................"

"మా అమ్మ పేరెత్తగానే నీకు నిజంగా కోపం వచ్చింది కదూ?"

"అబ్బే, నాకెందుకు కోపం? మీ తల్లీ కూతుర్లకి ఒకర్ని ఒకరు చూసుకోవాలని ఆ మాత్రం ప్రేమానురాగాలుండవా ఏమిటి? ఆ రక్తసంబంధం ఎక్కడికి పోతుంది? నాకు కోపం వచ్చిందని నీవలా అనుకుంటున్నావంతే" కప్పిపుచ్చుకోవడానికన్నట్లుగా అంటూ ముభావంగా వంటింట్లోకి వెళ్ళి ఏదో పని కల్పించుకొని చేయసాగింది పరమేశ్వరి.

నాయనమ్మ అలా ఉదాసీనంగా వెళ్ళిపోయేసరికి మనీషకు కొంచెం దిగులేసింది. బాధతో బరువుగా నిట్టూర్చింది.

"తానలా అమ్మ సంగతి ఎత్తకుండా ఉండాల్సింది నానీ ముందు" అనుకుంటూ నెమ్మదిగా వంటింట్లోకి వెళ్ళింది మనీష.

పరమేశ్వరి అటు తిరిగి స్టవ్ ముందు నిల్చుని గోధుమరవ్వని నెయ్యిలో దోరగా వేయిస్తూంది... సన్నని మంటపై కళాయి పెట్టి.

"వాహ్! కమ్మటి వాసనేదో వస్తుంది. నాకోసం ఏమైనా స్పెషల్ చేస్తున్నావా నానమ్మా?" అంటూ నేరుగా మనీష వంటింట్లోకి వచ్చి ఆవిడ వెనకాల నిల్చుని ఆవిడ మెడ చుట్టూ తన రెండు చేతుల్ని ప్రేమగా పెనవేసింది.

"ఊఁ, నీకిష్టమని రవ్వలడ్డు చేయబోతున్నాను."

"ఓఁ. థ్యాంక్యూ నానీ...!"

"థ్యాంక్స్ ఎందుకే పిచ్చిమనుమరాలా!..." చిన్నగా నవ్విందావిడ.

"ఐయామ్ సారీ నానీ! అమ్మ విషయం నీ ముందు అని నీకు బాధ కలిగించాను కదూ?" పరమేశ్వరి వైపు ఓరగా చూసింది.

"ఊ హుఁ, అదేం లేదు నిషా! ఈ ఆనంద సమయంలో మీ నాన్నే ఉండుంటే ఎంత సంతోషపడేవాడో కదా?... అని అనుకున్నాను" మనుమరాలితో ఓ పక్క మాట్లాడుతూనే మరో పక్క డ్రైఫ్రూట్స్ నెయ్యిలో వేసి ఫ్రై చేసి... చక్కెర లేత పాకంలో యాలకుల పొడి వేసి వేగిన రవ్వని అందులో వేసి ఉండలు కట్టకుండా చక్కగా కలుపుతూ కాస్త గట్టి పడినాక స్టవ్ ఆర్పేసింది.

నీళ్ళతో చేతిని తడి చేసుకొని చిన్న చిన్నగా గుండ్రంగా ఉండలు చేయసాగింది పరమేశ్వరి.

మనీష కూడా నాయనమ్మకు సాయంగా లడ్డూలు కట్టసాగింది ప్రయత్న పూర్వకంగా.

"నీకు మల్లే మీ నాన్నకు కూడా ఈ రవ్వలడ్లు అంటే చాలా ఇష్టం. వాడు ఇండియాకి వచ్చినప్పుడల్లా నన్ను అడిగి నాతో చేయించుకొని తెగ తినేవాడు ఈ స్వీట్‌ని.

"అవునా?... ఇంకా చెప్పు నానీ! మా నాన్నకి ఏమేమి ఇష్టమో?

సమయం వచ్చినప్పుడు తీరిగ్గా ఉన్నప్పుడు తండ్రి బాల్యానికి సంబంధించిన చిన్న చిన్న విషయాలెన్నింటినో మరీ మరీ అడిగి చెప్పించుకొని తృప్తిగా విని ఆనంద పడుతుంటుంది మనీష.

"నీవు పుట్టినప్పుడు మీ నాన్న నాతో ఏమన్నాడో తెలుసా?"

"ఏమన్నాడు నానీ? త్వరగా చెప్పు..."

"నేను మొదటి నుంచి కూడా నీ కోడలి అందచందాల్ని పుణికి పుచ్చుకొని చక్కటి పాపాయ్ కావాలనుకున్నాను. అచ్చం నేననుకున్నట్లుగానే పుత్తడి బొమ్మలా ఉందమ్మా నీ మనుమరాలు..." అని చెప్పి తెగ సంతోషపడ్డాడు వెర్రి నాగన్న" అంటూ పైట చెంగుతో కళ్ళొత్తుకుంది పరమేశ్వరి.

✧ ✧ ✧

ఆటో నిండుగా ఓ పెద్దసూట్‌కేస్, ట్రంకుపెట్టె... రెండు బుట్టలు, ఓ బ్యాగ్ పట్టుకొని వాకిట్లో చెప్పా పెట్టకుండా హఠాత్తుగా దిగిన దుర్గాంబకి స్వాగతం పల్కడానికి ఎవరూ ఎదురురాలేదు.

ముందు గదిలోనే కుర్చీలో కూర్చొని టి.వి.లో క్రికెట్ మ్యాచ్ చూస్తున్న భాస్కర్ కిటికీలో నుంచి చూసి, ఓ క్షణం విస్తుబోతూ గబగబా లోపలికెళ్ళాడు.

వంటింట్లో ఏదో పనిచేస్తున్న భార్య దగ్గరికెళ్ళి "ప్రేమీ! ఊర్నుంచి మీ అమ్మొచ్చింది. కాస్త వెళ్ళి ఆటోలో నుంచి ఆ సామాన్లు దించడానికి సాయం చేయి... వెళ్ళు త్వరగా" అన్నాడు.

భర్త మాటలకు ఆశ్చర్యపడిపోతూ అయోమయంగా చూస్తూ ఇవతలికి వచ్చింది ప్రేమిక. నిజంగానే అమ్మొచ్చింది.

మీటర్ మీద ఎక్కువ డబ్బులు అడుగుతున్నందుకు ఆటో అతనితో వాకిట్లోనే జగడం చేస్తోంది దుర్గాంబ పెద్ద గొంతుకతో.

"అయ్యో, పరంధామా! ఇదెక్కడి అన్యాయం నాయనా? డబ్బులెక్కువ నేనివ్వను. మీటరున్నది ఎందుకు? ఏవేవో మాయలు చేసిన ఆ మీటర్ కూడా విష్ణుచక్రంలా గిరగిరా తిరుగుతూనే ఉంది. అలా కూడా బాగానే డబ్బు ఎక్కువ సంపాదిస్తున్నారు. ఇంకెందుకివ్వాలి నీకెక్కువ డబ్బులు? నే ఛస్తే ఇవ్వను..."

తల్లి ఖచ్చితంగా చెప్తున్న జవాబు విని "పోనీలే అమ్మా! అతనడిగినట్లుగా డబ్బులిచ్చేయ్. వాకిట్లో నిల్చుని నీవిలా అరుస్తున్నట్లుగా మాట్లాడుతుంటే... చుట్టుపక్కల ఇండ్లలోని వాళ్ళకు చూసేందుకు వినోదంగా ఉంటుంది. మనకు బాగోదు. మీ అల్లుడి గారికి ఇలాంటివి నచ్చవ్..." అని నెమ్మదిగా ఆవిడకు సర్దిచెప్పింది.

దుర్గాంబ సణుక్కుంటూనే పర్సులో నుంచి డబ్బు తీసిచ్చింది.

"అవునూ, ఓ కార్డు ముక్కగానీ... ఓ ఫోన్ కాల్‌గానీ లేకుండా హఠాత్తుగా ఇలా ఊడిపడ్డావేమిటమ్మా? మరీ ఇన్ని సామానులు తెచ్చావ్... ఏమిటి విశేషం?..." తల్లితో అంటూనే, ఆ ఆటో అబ్బాయ్‌ని కొంచెం రిక్వెస్ట్ చేసి అతని సాయంతో సామానులన్నీ ఇంట్లోకి పట్టుకొచ్చింది ప్రేమిక.

పొట్టిగా లావుగా గుమ్మటంలా ఉన్న దుర్గాంబ లోపలికొస్తూ "అబ్బాయ్! బాగున్నావా?'' ముఖమంతా నవ్వు పులుముకొని అల్లుడిగారిని సాదరంగా పలుకరించింది.

"ఆఁ బాగున్నాను అత్తయ్యా! మీరెలా ఉన్నారు? ఊళ్ళో రమణ అతని భార్య అంతా కుశలమే కదా? మీ ఆరోగ్యమెలా ఉంది?

"ఆఁ, ఆఁ... అందరు బాగున్నారు. అయ్యో, పరంధామా! నా ఆరోగ్యం గురించి ఏమని చెప్పను నాయనా! సరిగ్గా ఉండడం లేదీ మధ్య. పట్టుమని పది మెతుకులు కూడా తినలేకపోతున్నాను. ఒంట్లో ఒకటే నీరసం. కాస్త దూరం నడిస్తే ఆయాసం. ఏం మాయదారి రోగం వచ్చిందో తెలియడం లేదు. దానికితోడు ఈ మోకాళ్ళ నొప్పులొకటీ..." అని సాగదీస్తూ అడిగిందే తడవుగా వచ్చీరావడంతోనే అల్లుడిగారికి తన ఆరోగ్యపరిస్థితినంతా ఏకరువు పెట్టింది.

"మీ అమ్మాయ్ ఇక్కడ మంచి డాక్టరుకు చూపించి మందులవి ఇప్పిస్తుంది లెండి. మీరేం అంతగా దిగులు పడకండి. మీ ఆరోగ్యం త్వరగానే బాగైపోతుంది లెండి" అన్నాడు భాస్కర్. అత్తా అల్లుడికి అస్సలు పడదు. ఖాళీ డబ్బాలో రాళ్ళేసి ఆడించినట్లుగా ఆవిడ కంచు కంఠంతో గలగలా మాట్లాడుతుంటే చాలా చిరాగ్గా ఉంటుందతనికి.

దానికితోడు తమ ఇంటి చుట్టుపక్కల ఇండ్లలో ఏమేమి జరుగుతున్నాయో తెల్సుకోవడం... పనిమనుషుల ద్వారా ఆరాలు తీయడం... పరులకు సంబంధించిన విషయ సేకరణకు ఎక్కువ సమయం కేటాయిస్తుంది. ఎంత కష్టసాధ్యమైనా సరే ఏ సి.ఐ.డి. కూడా కనుక్కోలేని అతి రహస్య విషయాలు కూడా ఇట్టే క్షణంలో పసిగట్టేస్తుంది. అదీ దుర్గాంబగారి నైజం.

అత్తగారి ఇలాంటి వైఖరి అల్లుడికి అస్సలు సరిపడదు; నచ్చనే నచ్చదు.

ఆవిడ ఇంటికి వచ్చిందంటే సరి... మళ్ళీ ఎప్పుడు వెళ్ళుతుందాని నిరీక్షిస్తూ ఉంటాడు భాస్కర్. ఇద్దరి మధ్య మాటలు కూడా అంతగా ఏమీ ఉండవు.

భాస్కర్ ఇంట్లో ఉన్నంతసేపూ అల్లుడి భయానికి ఎటూ కదలకుండా తాడేసి కట్టిపడేసినట్లుగా ఇంట్లోనే కుదురుగా ఉంటుంది. అతనలా ఆఫీసుకు వెళ్ళగానే "నేనోమారు అలా మీ ఎదురింటి వెంకాయమ్మగారింటికో, లేదా పక్కింటి మణెమ్మ గారింటికో వెళ్ళి వస్తానే అమ్మాయ్!..." అని కూతురికి కేకేసి చెప్పి వెళ్ళుతుంది; విహంగంలా బయలుదేరుతూ అలా ఇల్లిల్లూ తిరిగి కబుర్లతో కడుపు నింపుకొని... మళ్ళీ సరిగ్గా భోజనాల వేళకి ఇంటికి తిరిగి వస్తుంటుంది.

ఇంట్లో కూతురికి వంటపనిలో గాని, ఇంటిపనిలోగాని కాసింత సాయం చేద్దామన్న ఆలోచన కూడా ఉండదావిడకు. అందుకనే కొడుకు, కోడలితో పడక అస్తమానం ఇలా కూతురింటికి వచ్చి నెలలు నెలలు తిష్టవేస్తుంటుంది. పాపం, కన్న తల్లి కాబట్టి ప్రేమికకు భరించక తప్పదు. చూస్తూ చూస్తూ ఉంటుందేగాని తల్లిని పల్లెత్తు మాట కూడా అనదు, తన పనేదో తాను చేసుకుంటుంది. "అమ్మా! కాస్త ఈ పని చేసి పెట్టవా అని కనీసం అడగును కూడా అడగదు? ఒకవేళ అడిగినా ఆవిడ చేయదనీ తెల్సు కాబట్టి, తల్లి స్వభావం తనకు తెల్సుకాబట్టి మౌనంగా ఉంటుంది.

కాఫీ కప్పు అందిస్తున్న భార్యవంక సూటిగా చూస్తూ "మీ అమ్మ ఈ మారు చాలాకాలం ఇక్కడే మనింట్లోనే తిష్టవేసేట్లుంది ప్రేమీ! ఎందుకంటే పెట్టే బేడా పూర్తిగా సర్దుకొని వచ్చేసినట్లుగా ఉంది..." గుసగుసగా అన్నాడు భాస్కర్.

"అవును నాకు అలాగే అన్పిస్తుందండి! తమ్ముడితోనో, మరదలితోనో ఏదో గొడవ పడి దెబ్బలాడే వచ్చినట్లుంది. విషయమేమిటో నేనడిగి కనుక్కుంటాను లెండి..."

"కనుక్కో... సాధ్యమైనంత త్వరగా ఆవిడ్ని ఇక్కడి నుంచి పంపించే ఏర్పాట్లు చూడు!..."

"ఊఁ. ఊర్కోండిక. అమ్మొస్తుంది బాత్‌రూమ్‌లోనుంచి. వింటే బాగోదు..." తగ్గు స్వరంతో అంటూ ప్రేమిక మళ్ళీ గబగబా వంటింటి వైపు వెళ్ళింది.

"అమ్మాయ్! సూరిబాబు ఇంట్లో లేడేమిటి ప్రేమీ! ఈ రోజు ఆదివారమే కదా!..." మనవడిని గురించి ఆరాదీసింది దుర్గాంబ.

"వాడు ట్యూషన్ కెళ్ళాడమ్మా! ఇంకాసేపట్లో వచ్చేస్తాడులే... నీవేం తీసుకుంటావో ముందుగా చెప్పు. కాఫీయా, టీయా?"

"నాకు ఏదైనా ఫర్వాలేదు. అలాగే తినడాక్కి ఏమన్న ఉంటే పెట్టు. ప్రయాణం హడావిడిలో ఉదయం పెందరాళే భోజనం చేశాను కదా! బాగా ఆకలేస్తుందే ప్రేమీ!..."

"అయ్యో, నేనడగడమే మర్చిపోయానమ్మా. సారీ... కాస్త ఆగమ్మా!... గబగబా ఏదైనా వేడిగా టిఫిన్ చేసి పెడ్తాను."

"అబ్బే! ఒద్దులేవే... కాస్త అటుకులో... మరమరాలో ఉంటే పెట్టు చాలు. పాలు పోసుకొని తింటాను" అంటూ డైనింగ్ టేబుల్ ముందు కుర్చీలో స్థిమితంగా కూర్చుంది దుర్గాంబ.

"అటుకులెందుకులే అమ్మా! నీకసలే మోకాళ్ళ నొప్పులు. అవి తింటే వాతం కూడాను. నిన్న సూరికోసమని కొంచెం కారాబూందీ చేశాను. అది పెడ్తాను..." అంటూ తల్లికి ఓ ప్లేట్లో కారాబూందీ... ఓ మైసూర్ పాక్ ముక్క పెట్టిచ్చి గ్లాసుతో నీళ్ళు కూడా దగ్గరే పెట్టింది ప్రేమిక.

తాపీగా నెమ్మదిగా అవి తింటూ తీరుబాటుగా ఇక కూతురితో కబుర్లకు ఉపక్రమించిందావిడ. "కొడుకుకో చవట దద్దమ్మనీ, అస్తమానం పెండ్లాం కొంగు పట్టుక తిరుగుతాడనీ"... కొడుకు, కోడల్ని తెగ తిడ్తూ తన కష్టసుఖాల్ని కూతురితో అదేపనిగా ఏకరువు పెట్టసాగింది దుర్గాంబ.

భాస్కర్ ముందు గదిలో టీవి చూస్తున్నాడు.

"అమ్మాయ్, ప్రేమీ! నేవిన్నది నిజమేనా?..." ఉన్నట్లుండి ఆవిడ చాలా లోగొంతుకతో అడిగింది.

తానేం విందో... ఏది నిజమో ఏమీ అర్థంకాక ప్రేమిక సందేహంగా చూసింది తల్లివంక. "ఏ విషయం నీవడిగేది?" సూటిగా ప్రశ్నించింది.

"అదేనే మీ తోడికోడలి వ్యవహారం. మలేషియానో, మారిషస్‌నో ఏదో దేశంలో ఉండే ఆమె ఇంగ్లీష్‌వాండ్ల దేశం లండన్ వెళ్ళి అక్కడ పెళ్ళాం విడిచి పెట్టినవాడి నెవడినో రెండో పెళ్ళి చేసుకుందటగా?! అయ్యో, పరంధామా! మీకు తెలియదా ఈ సంగతి?..." రహస్యంగా గుసగుసగా అడిగింది అవతలున్న అల్లుడికి వినబడకుండా. దానితో కాస్త కోపోద్రేకంతో గుడ్లురిమి చూసిందీమారు కూతురు తల్లివంక.

"ఇప్పుడనగా వచ్చావ్? అప్పుడే నీకెందుకీ విషయాలన్నీనూ?..."

"అయ్యో, పరంధామా! ఉన్న మాటంటే ఎందుకే నీకింత కోపం? దేశమంతా ఈ విషయాన్ని కోడై కూస్తుంటేనూ..."

"ఆఁ దేశానికి ఏ సమస్యలూ చట్టుబండలూ లేవు కాబోలు! మా తోడికోడలి పెళ్ళి విషయమే కోడై కొక్కొరకో అని కూస్తుంది."

"అవునే, నేనన్నది అక్షరాలా నిజం, నీవెందుకిలా వెటకారంగా దెప్పుతావ్? మనవాళ్ళందరికీ తెలుసు ఈ విషయం. అయినా పెళ్ళీడు కొచ్చిన చెట్టంత కూతురుండగా... మొగుడు చచ్చిన తనకీ వయసులో మళ్ళీ రెండో పెళ్ళి కావల్సి వచ్చిందా? అయ్యో, పరంధామా! మన బంధువర్గంలో నల్గురికీ ఈ సంగతి తెలిస్తే హవ్వ! ఎంత అప్రతిష్ఠ? అయినా మీ అత్తామామలు పెద్దకొడుకు చచ్చినప్పుడు ఆ దేశానికెళ్ళి ఇంకా అక్కడే పాతుక పోయారేమిటీ? ఆ మారిషస్ దేశం నుంచి వాళ్ళిక్కడికి మళ్ళీ రాగూడదనే అనుకున్నారా ఏమిటి? పెద్దవాళ్ళు... కోడలికి వాళ్ళైనా కాస్త గడ్డి పెట్టొద్దూ! స్వీట్ బాగుందే ప్రేమీ? ఏదీ... ఇంకో ముక్క ఇలా పడేయ్..."

ఆవిడ వాగ్ధాటికి ఈమారు కోపంతో మరింతగా ఒళ్ళుమండిపోయింది ప్రేమికకు.

"లేదిక స్వీట్. సూరి కోసమని ఉంచిన ఆ ఒక్కముక్క బూందీతో పాటుగా నీకు పెట్టాను. అమ్మా! నీకు దండం పెడ్తాను. ఆయన ఇంట్లోనే ఉన్నారు. నీవిప్పుడు ఈ పురాణాలన్నీ చదవడం మొదలెట్టకు. వింటే మండిపడుతారాయన."

"అయ్యో పరంధామా! ఇప్పుడు నేనేమన్నాననీ... నీకింతగా కోపం రావడానికి. ఉన్నమాటేగా అన్నాను."

"ఉన్నమాటో... లేనిమాటో నీవిక్కడ ఉన్నన్ని రోజులు మా కుటుంబానికి సంబంధించిన ఏ విషయంలోనూ జోక్యం కలుగచేసుకోకు. ప్రతి విషయంలోనూ వేలు పెడ్తూ తగుదునమ్మా అంటూ మధ్యకు రాకు. ముందుగా నీకిదే నా మొదటి హెచ్చరిక!..." అంటూ వేడి వేడిగా కాఫీ గ్లాసు నిండా పోసి తెచ్చి తల్లి ముందుంచింది ప్రేమిక.

"సరేలేవే... ఉన్నమాటంటే ఎవరికైనా ఉలుకే మరి..." అని ఆ ప్లేట్ ఖాళీ చేసి కాఫీ గ్లాసుని చేతిలోకి తీసుకొని ఊదుకుంటూ ఒక్క గుక్క తాగి "అబ్బో!

చిరుచేదు. ఇంత చప్పగా ఎలా తాగుతారో మీరు?... ఏదీ ఓ రెండు స్పూన్ల పంచదార ఇలా వేయ్" అంది.

ప్రేమిక ఏం మాట్లాడకుండా పంచదార డబ్బా, స్పూన్ తెచ్చి తల్లి ముందెట్టి వెళ్ళిపోయింది.

క్రికెట్ మ్యాచ్ అయిపోయిందిలా ఉంది. టి.వి. కట్టేసి భాస్కర్ ఏదో పనిమీద అలా బయటికి వెళ్ళగానే, ట్యూషన్ వెళ్ళిన సూరిబాబు వచ్చాడింటికి.

భుజానికున్న బ్యాగ్ తీసి అల్లంత దూరంలో పడేలా గిరవాటేసి వంటింటి వైపు దూసుక వచ్చాడు.

తండ్రి ఇంట్లో లేకపోతే సరి... వాడికి విచ్చలవిడితనం మరీ ఎక్కువ. దూకుడుగా తల్లిమీదకి విజృంభిస్తాడు.

వాడి మాటలు కూడా అలాగే దూకుడుగా పదునుగా ఉంటాయ్. ఎవరో నేర్పిపెట్టినట్లుగా మాట్లాడుతాడు. పెద్దవాళ్ళని కూడా లెక్క చేయడొక్కొక్కసారి. సంధించిన బాణాల్లా వదులుతాడు మాటల్ని.

లోపలికి రాగానే డైనింగ్ టేబుల్ ముందు కుర్చీలో కూర్చున్న అమ్మమ్మ అనే శాల్తీని చూడగానే కనుబొమ్మలు అదోలా ఎగరేసి "ఓహోఁ, తమరెప్పుడో దయచేసి మా గృహం పావనం చేసినట్లున్నారే? ఎప్పుడు ఊడిపడ్డావ్ మా ఇంటికి అమ్మమ్మా?..." వెక్కిరిస్తున్నట్లుగా అన్నాడు.

"అదేంటిరా సూరీ! నా బంగారుకొండ! నిన్ను ఎప్పుడెప్పుడు చూద్దామా అని నా మనస్సెంతగా కొట్టుకలాడిందో తెలుసా? అంతదూరం నుంచి నేను నీకోసం వస్తే నీవిలా మాట్లాడుతావేంరా భడవకానా!..." అని మనవడి వంక అపేక్షగా చూస్తూ దుర్గాంబ ముఖమంతా నవ్వు పులుముకొని "ఎలా ఉన్నావురా సూరీ?" అంటూ మనస్సులో లేని ఆప్యాయతానురాగాల్ని బోల్డు ఒలకబోసింది.

"నేను బాగానే ఉన్నానుగాని, మరి ఊర్నించి వచ్చేప్పుడు నా కోసం ఏమేమి తెచ్చావ్ అమ్మమ్మా? త్వర త్వరగా చెప్పు..." సూరిబాబు ఎంతో ఆశగా అడిగాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Akhanda+Deepikalu**

* * *